నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

నైపర్ అహ్మదాబాద్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (నైపర్), అహ్మదాబాద్... రెగ్యులర్/ కాంట్రాక్టు ప్రాతిపదికన ఫ్యాకల్టీ, నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: ఫ్యాకల్టీ-28, నాన్ ఫ్యాకల్టీ-25
పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అకౌంటెంట్, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ తదితరాలు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: సెప్టెంబరు 8
వెబ్‌సైట్: https://niperarecruitments.in/

దిల్లీ హైకోర్టు

దిల్లీ హైకోర్టు.. డ్రైవర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: డ్రైవర్ (షాఫర్)
ఖాళీలు: 35 **అర్హత:** మెట్రిక్/ హయ్యర్ సెకండరీ ఉత్తీర్ణత, లైట్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్, రెండేళ్ల అనుభవం.
వయసు: 18-27 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక: ప్రిలిమినరీ పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తు:** ఆగస్టు 14 నుంచి సెప్టెంబరు 5 వరకు **వెబ్‌సైట్:** www.delhihigh-court.nic.in

ప్రవేశాలు

మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ

నాగ్‌పుర్‌లోని మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ... ఇతర వర్సిటీల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న సర్టిఫికెట్, పీజీ డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
కోర్సులు: సర్టిఫికెట్ - శాస్త్రిక్ మెథడ్ ఆఫ్ ఆర్గ్యుమెంటేషన్ (3 నెలలు), పీజీ డిప్లొమా - ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్, ఫ్యామిలీ డిస్ప్యూట్ రిజల్యూషన్, ఎనర్జీ లాస్ అండ్ పాలసీ (ఏడాది). **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత.
ఎంపిక: అకడమిక్ మెరిట్ ఆధారంగా.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ **చివరితేది:** ఆగస్టు 27
వెబ్‌సైట్: www.nlunagpur.ac.in

సందేహాలకు ఆహ్వానం



సచివాలయ పోస్టులకు లక్షలాది మంది పోటీ పడుతున్నారు. ఈ సందర్భంగా ఎదురయ్యే సందేహాలకు 'ఈనాడు-చదువు' సమాధానాలను అందించనుంది. అభ్యర్థులు సిలబస్, ప్రిపరేషన్, పరీక్షల పరంగా వచ్చే ఇతర ప్రశ్నలను ఈ కింది ఈ-మెయిల్‌కు పంపాలి.

e-mail: edc@eenadu.in

కొద్ది రోజుల్లోనే సర్కారీ కొలువులో కుదురుకునే అరుదైన అవకాశం వచ్చింది. ఒకటి కంటే ఎక్కువ పోస్టులు ఒక్కసారిగా అందివస్తున్నాయి. పరీక్ష తేదీ దూసుకొచ్చేస్తోంది. అవగాహన లోపంతో, అస్పష్టతతో ఏ చిన్న తప్పటడుగు వేసినా అదృష్టం తల్లకిందులైపోతుంది. సాధారణ అభ్యర్థులు, సాంకేతిక విద్యార్థులు ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రణాళికలు రూపొందించుకోవాలో పరిశీలించుకోవాలి. పోటీ పరిస్థితులను అంచనా వేసుకొని, ఎదుర్కోడానికి తగిన స్వీయ వ్యూహాన్ని సిద్ధం చేసుకోవాలి.

ప్రిపరేషన్ విధానం

సిలబస్ కొండను ఢీ కొట్టడమెలా?

గ్రామ, వార్డు సచివాలయాలలో ప్రకటించిన పోస్టులను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. టెక్నికల్ పోస్టులు, నాన్ టెక్నికల్ పోస్టులు.

- సాంకేతిక విద్యార్హతలతో, ఉద్యోగ బాధ్యతలు ప్రత్యేక తరహావి టెక్నికల్ పోస్టులు. గ్రామ ఫిషరీస్ అసిస్టెంట్, గ్రామ పశు సంవర్ధక అసిస్టెంట్, గ్రామ హార్టీకల్చర్ అసిస్టెంట్, గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్, గ్రామ సెరికల్చర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, గ్రామ సర్వేయర్ గ్రేడ్-2, డిజిటల్ అసిస్టెంట్, వార్డ్ శానిటేషన్ సెక్రటరీ, వార్డ్ ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీ, వార్డ్ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ సెక్రటరీ పోస్టులు సాంకేతిక స్వభావం ఉన్నవి.
- పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-5, మహిళా పోలీస్, విమెన్- చైల్డ్ వెల్ఫేర్ అసిస్టెంట్ లేదా వార్డ్ ఉమన్, వీకర్ సెక్షన్ ప్రొటెక్షన్ సెక్రటరీ, వార్డ్ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ పోస్టులు నాన్ టెక్నికల్ తరహాకు చెందినవి.

వీటిలో ఏదైనా డిగ్రీ చేసినవారు దరఖాస్తు చేసుకున్న కేటగిరి-1 పోస్టులు పంచాయతీ కార్యదర్శి ((గ్రేడ్-5), వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, మహిళా పోలీసు, మహిళా శిశు సంక్షేమ అసిస్టెంట్ లేదా వార్డు మహిళా ప్రొటెక్షన్ సెక్రటరీ.

దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల్లో రెండు రకాల వారున్నారు. మొదటి తరహా అభ్యర్థులు సాధారణ బీఎస్సీ, బీకాం, బీఏ వంటి సాంప్రదాయిక డిగ్రీలు చేసినవారు. వీరిలో ఏ విధమైన అస్పష్టత లేదు. మొత్తంలో వీరికి అవకాశం ఉన్నవి నాలుగు కేటగిరీలే కాబట్టి నేరుగా దరఖాస్తు చేసి ప్రిపరేషన్‌లో పడ్డారు. ఇప్పుడు వచ్చిన దరఖాస్తుల్లో వీళ్లవే ఎక్కువ భాగం. వీరిలో మళ్లీ రెండు రకాల వారున్నారు. ఇందులో రిపీటర్లు అంటే గతంలో గ్రూప్స్‌లో వివిధ పరీక్షలు రాసినవారు. ఇన్ని పోస్టులు మరెప్పుడూ రావు కాబట్టి రిపీటర్స్‌కు ఇది విజయమో వీరస్వర్గమో. రిపీటర్స్ ఇప్పటికే సన్నద్ధతకి దిగిపోయారు. ముఖ్యంగా రాతపరీక్షల అనుభవాల రీత్యా తమకు క్లిష్టతరంగా పరిణమించే విభాగాలపై, జనరల్ స్టడీస్‌లోని అన్ని విభాగాలలోని తాజా అంశాలపై దృష్టి పెట్టారు. ఇక కామన్ డిగ్రీతో దరఖాస్తు చేసేవారిలో తాజా అభ్యర్థులకు సమయమే సవాలు. కనీసం ఆర్నెల్లు చదవాల్సిన జనరల్ స్టడీస్ నెలరోజుల్లో పూర్తి చేయాల్సి రావడం కొండను ఢీకొనడమే. అయితే, క్లిష్ట విభాగాల నుంచి సులభ విభాగాలవైపు ప్రిపరేషన్ సాగితే ప్రయత్నం ఫలించవచ్చు.

జీఎస్ - వర్తమానాంశాలపై ప్రధాన దృష్టి

సాంకేతిక, ప్రత్యేక పోస్టులకు సంబంధించిన సబ్జెక్టుకు 100 మార్కులు కేటాయించగా 50 మార్కులు జనరల్ స్టడీస్ నుంచి ఉంటాయి. మొత్తం 150 మార్కులతో 80 నుంచి 90 మార్కుల మధ్య స్కోర్ చేసిన వారికి విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయి. సాంకేతిక పోస్టుకు సంబంధించిన విభాగంలో సీరియస్ అభ్యర్థులందరూ దాదాపుగా సమాన ప్రతిభ చూపే అవకాశం ఉంది. ఈ తరహా అభ్యర్థులందరికీ జనరల్ స్టడీస్ కొత్త సబ్జెక్టు కాబట్టి ఈ విభాగంలో వచ్చే స్కోరే కీలకం అవుతుంది. జీఎస్‌లో పది అంశాలున్నాయి. అంటే ఈ విభాగంలోని 50 ప్రశ్నలు 10 అంశాల నుంచి ఇస్తారు. ఒక్కో అంశం నుంచి సగటున అయిదు ప్రశ్నలు రావచ్చు. ఈ అంశాలను రెండు కేటగిరీలుగా (సాంప్రదాయిక, వర్తమాన సంబంధిత) వర్గీకరించవచ్చు. మెంటల్ ఎబిలిటీ, జనరల్ ఇంగ్లిష్, జాగ్రఫీ, హిస్టరీ నాలుగు సాంప్రదాయిక సబ్జెక్టులున్నాయి. మిగతావన్నీ వర్తమాన అంశాలతో ముడిపడినవే. పాలిటీ- కేంద్ర రాష్ట్ర సంబంధాలు, సామాజిక న్యాయం, హక్కులు, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ సమకాలీన అంశాలు. జనరల్ స్టడీస్ సిలబస్ విస్తృతం- స్వల్ప సమయంలో సన్నద్ధత కష్టం అని భయపడకుండా వర్తమాన అంశాలపై దృష్టిపెడితే అయిదారు విభాగాలు కవర్ అవుతాయి. ఈ ఏడాది జనవరి నుంచి కరెంట్ అఫైర్స్‌ను ఈ విభాగాలకు అనుసంధానం చేసుకుంటూ చదవగలిగితే జనరల్ స్టడీస్‌లో సగభాగం పూర్తయినట్టే.

మిగతా సాంప్రదాయిక సబ్జెక్టులను సమయ పరిమితి రీత్యా కొంతవరకు పూర్తి చేయగలిగినా జనరల్ స్టడీస్‌లో ఈ స్వల్ప వ్యవధిలో మెరుగైన స్కోర్‌ను సాధించవచ్చు.

- యస్.వి. సురేశ్

సాంకేతిక అభ్యర్థులకు సదవకాశం

గ్రామ, వార్డు సచివాలయ పోస్టులు సాధారణ డిగ్రీ చేసిన అభ్యర్థులకు వరప్రసాదమైతే, సాంకేతిక డిగ్రీ చేసిన గ్రాడ్యుయేట్లకు డబుల్ బొనాంజా. వీరు ఒక పక్క కేటగిరీ-1లోని పోస్టులకు పోటీ పడొచ్చు. మరో పక్క తమ విద్యార్హతలకు తగిన టెక్నికల్ పోస్టులకూ దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు రెండింటికీ చేసుకున్నా దేన్ని లక్ష్యం చేసుకోవాలనేది సమస్య.

టెక్నికల్ విద్యార్హతలున్న అభ్యర్థుల్లో ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్న డిజిటల్ అసిస్టెంట్‌కు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్, ఐటీ బ్రాంచ్‌లో డిగ్రీ లేదా డిప్లొమా, బీకాం, బీఎస్సీ కంప్యూటర్స్ చేసినవారు అర్హులు. డిగ్రీ అర్హతతో కేటగిరీ-1లోని సాధారణ పాలనా పోస్టులకు సైతం తమకు అర్హత ఉంది కాబట్టి ఎటువైపు వెళ్లాలన్నది వీరి సంశయం. ఏ దిశగా వెళితే, విజయం సాధిస్తామన్నది వీరిని వేధిస్తోంది.

డిజిటల్ అసిస్టెంట్ సిలబస్ పార్ట్-బిని పరిశీలిస్తే కంటెంట్స్ బీటెక్ ఈసీఈ బ్రాంచి చేసినవారికి సులభంగా కనిపిస్తున్నాయి. ఇంజినీరింగ్ కంటెంట్‌లో కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ అంశాలు ఎక్కువగా ఉన్నందువల్ల ఈసీఈ సబ్జెక్టులో బలంగా ఉన్నవారు మంచి స్కోర్ సాధించే అవకాశం ఉంది. దీని తర్వాత బి.టెక్ కంప్యూటర్ సైన్స్ అభ్యర్థులకు అనుకూలంగా ఉంది. ఈ రెండు బ్రాంచిల వారితో బీఎస్సీ, బీకాం కంప్యూటర్స్ పోటీపడాల్సి ఉంటుంది కాబట్టి వాళ్లు అప్రమత్తంగా ఉండాలి.

డిజిటల్ అసిస్టెంట్ 150 మార్కుల పరీక్షలో 50 మార్కులు జనరల్ స్టడీస్ మినహాయిస్తే 100 మార్కులకు సబ్జెక్టు పేపర్ ఉంది. బీటెక్ అభ్యర్థులు తాము బలంగా ఉన్నదాన్ని వదిలి సాధారణ డిగ్రీతో పంచాయతీ గ్రేడ్-5 తదితర పోస్టుల వారితో తలపడటం నష్టాన్ని కలిగించవచ్చు. దాని కంటే డిజిటల్ అసిస్టెంట్ పైనే పూర్తి దృష్టి పెట్టడం శ్రేయస్కరం కావచ్చు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్ పోస్టుకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. ఈ పోస్టులకు సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ చేసినవారు అర్హులు. తమ కోర్ సబ్జెక్టుల్లో బలంగా ఉన్నవారు కేటగిరి-1 సాధారణ పాలనా పోస్టుల వైపు వెళ్లడం అనవసరం. ఇంజినీరింగ్ అసిస్టెంట్ పోస్టులకు పోటీపడటమే మంచిది. గతంలో గ్రూప్స్ పరీక్షలు రాసినవారు సాధారణ పోస్టులకు తీవ్ర పోటీ ఇస్తారు.

టెక్నికల్ పోస్టుల విషయంలో పాలిటెక్నిక్ డిప్లొమా అభ్యర్థులకు మెరుగైన అవకాశాలు ఉన్నాయి. పాలిటెక్నిక్ డిప్లొమా, దీని తర్వాత ఇంజినీరింగ్ చేసిన అభ్యర్థులు సొంత సబ్జెక్టులపై పట్టు ఉంటుంది. అదనంగా ఉన్న 50 మార్కుల జనరల్ స్టడీస్‌లో కాస్త మెరుగైన ప్రతిభ చూపితే పోటీలో ముందుండే అవకాశం ఉంది.

ఏపీ ప్రాధాన్యాలు.. ప్రగతి!

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ

పంచవర్ష ప్రణాళికలు, వాటి విజయాలు , వైఫల్యాలపై సమగ్ర అవగాహన పెంచుకుంటే అభివృద్ధికి సంబంధించిన అంశాలను తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు. ప్రధానంగా ప్రణాళిక లక్ష్యాలు ఏమిటి, ఏయే రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు, ఎంత వరకు సఫలీకృతమయ్యారు, ఆ సమయంలో ఎలాంటి పథకాలను అమలు చేశారు.. ఇలాంటి విషయాలపై అభ్యర్థులు దృష్టి పెట్టాలి. గణాంకాలను ఒకటికి రెండుసార్లు మననం చేసుకోవాలి.

ప్రణాళికల కాలంలో రాష్ట్రాభివృద్ధి

మిశ్రమ ఆర్థిక వ్యవస్థ కలిగిన భారతదేశంలో పంచవర్ష ప్రణాళికల ద్వారా ఆర్థికాభివృద్ధికి ప్రయత్నించారు. కేంద్ర ప్రణాళికా సంఘం దేశం మొత్తానికి ఒకే విధమైన కేంద్రీకృత ప్రణాళికను రూపొందిస్తుంది. రాష్ట్రాల సభ్యత్వం కలిగిన జాతీయాభివృద్ధి మండలి ప్రధానమంత్రి అధ్యక్షతన సమావేశమై చర్చించి నమూనా ప్రణాళికను ఆమోదిస్తుంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ప్రణాళికను అమలు చేస్తాయి.

1951-2017 మధ్య 12 పంచవర్ష ప్రణాళికలు; 1967-69, 1990-92 మధ్య రెండు వార్షిక ప్రణాళికలు, 1978-80 మధ్య ఒక నిరంతర ప్రణాళికను అమలుచేశారు. రాష్ట్రస్థాయిలో స్థానిక అవసరాలు, వనరులకు సరిపడే వార్షిక ప్రణాళికలను బడ్జెట్‌లో భాగంగా రాష్ట్రాలు తయారు చేసుకుంటాయి. వీటిని ప్రణాళికా సంఘం ఆమోదించాలి. రాష్ట్రస్థాయి ప్రణాళికలు జాతీయ ప్రణాళికల లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలి. రాష్ట్రాలకు కావాల్సిన ప్రణాళిక నిధులను ప్రణాళికా సంఘం అందిస్తుంది. రాష్ట్ర ప్రణాళికలను ఆయా రాష్ట్రాల ప్రణాళికా బోర్డులు రచిస్తాయి. ముఖ్యమంత్రి అధ్యక్షతన ఆర్థిక మంత్రి, ప్రణాళిక మంత్రి, సాంకేతిక నిపుణులు ప్రణాళిక బోర్డులో సభ్యులుగా ఉంటారు. జిల్లా స్థాయిలో పాలనాధికారి అధ్యక్షతన జిల్లా ప్రణాళిక, అభివృద్ధి కమిటీ; మండల స్థాయిలో మండల అభివృద్ధి అధికారి అధ్యక్షతన 25 మంది సభ్యులతో మండల ప్రణాళిక, అభివృద్ధి కమిటీ ప్రణాళిక అమలును పర్యవేక్షిస్తాయి.

2015, జనవరి 1 నుంచి ప్రణాళికా సంఘం స్థానంలో ప్రధానమంత్రి అధ్యక్షతన నీతిఆయోగ్‌ను న్యూదిల్లీలో ఏర్పాటు చేశారు. పంచవర్ష ప్రణాళికలు రద్దు చేసి మూడేళ్ల కార్యాచరణ ప్రణాళిక, ఏడేళ్ల విజన్, 15 ఏళ్ల దీర్ఘదర్శి ప్రణాళికను అమలు చేస్తున్నారు. నవ్యాంధ్రప్రదేశ్ సహా అన్ని రాష్ట్రాలు నీతిఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్‌లో సభ్యత్వం కలిగి గతానికి భిన్నంగా ప్రణాళిక రచనలో పాలు పంచుకుంటున్నాయి. ఇది సహకార సమాఖ్యకు ముందడుగు.

జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేసిన ప్రణాళికలు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కింది ప్రాధాన్యాలను కలిగి ఉన్నాయి.

డి.రామానుజులు
అసిస్టెంట్ ప్రొఫెసర్

ప్రాధాన్యాలు

రాష్ట్రంలో ముఖ్యంగా అభివృద్ధి అంశాలను ఎనిమిది ప్రాధాన్యత రంగాలుగా విభజించారు.

1) విద్యుత్తు 2) నీటిపారుదల 3) సామాజిక సేవలు 4) గ్రామీణాభివృద్ధి 5) రవాణా కమ్యూనికేషన్ 6) వ్యవసాయం 7) పరిశ్రమలు, గనులు 8) ఇతర అంశాలు

జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రణాళికలు అమలుచేశారు. స్థానిక పరిస్థితులకు ప్రాధాన్యం ఇచ్చి అభివృద్ధి సాధించారు.

★ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడే నాటికి (1956, నవంబరు 1) దేశవ్యాప్తంగా రెండో పంచవర్ష ప్రణాళిక (1956-61) అమల్లో ఉంది. రాష్ట్రానికి రూ.179.8 కోట్లు కేటాయించారు.

★ మొదటి మూడు ప్రాధాన్య అంశాలు స్థానాలు మార్చుకుంటూ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. నీటిపారుదలకు రెండు, మూడో ప్రణాళికల్లో మొదటి ప్రాధాన్యం ఇచ్చి సగటున 35% నిధులు కేటాయించారు. వ్యవసాయాభివృద్ధికి ఆవశ్యకమైన నీటిపారుదల పెంపు కోసం నాగార్జునసాగర్, శ్రీశైలం లాంటి భారీ ప్రాజెక్టుల నిర్మాణాలను ప్రారంభించారు.

★ పరిశ్రమల విస్తరణకు ఆధారమైన విద్యుత్ సౌకర్యాల వృద్ధి కోసం విద్యుత్ రంగానికి నాలుగు, ఐదు, ఎనిమిది, తొమ్మిదో పంచవర్ష ప్రణాళికల్లో మొదటి ప్రాధాన్యం కల్పించి దాదాపు 37% పైగా నిధులు కేటాయించారు. థర్మల్, జలవిద్యుత్ ప్లాంట్ల అభివృద్ధికి పునాదులు వేశారు.

★ ఆరు, ఏడు, పది, పదకొండో పంచవర్ష ప్రణాళికల్లో సామాజిక సేవలకు దాదాపు 30% నిధులు కేటాయించి మొదటి ప్రాధాన్యం కల్పించారు. వివిధ సామాజిక సంక్షేమ పథకాలను అమలుచేశారు.
ఉదా: సబ్సిడీ బియ్యం, జనతావస్త్రాలు, మధ్యాహ్న భోజన పథకం, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ.

★ వ్యవసాయ అనుబంధ రంగాలకు సగటున అన్ని ప్రణాళికల్లోనూ 5%, గ్రామీణాభివృద్ధికి 6% నిధులు కేటాయించారు.

★ పరిశ్రమల కోసం సగటున 4% నిధులు, రవాణా - కమ్యూనికేషన్ లాంటి సేవల రంగాలకు 9% నిధులు మాత్రమే వెచ్చించారు. దీని ఫలితంగా ప్రస్తుతం రాష్ట్రం సేవలరంగం అభివృద్ధిలో ముందంజలో ఉన్నప్పటికీ పారిశ్రామికంగా వెనుకబడింది. 90వ దశకం నుంచి ఈ ధోరణి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

ఫలితంగా వ్యవసాయ ఆర్థికవ్యవస్థ నుంచి సేవలే ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఆంధ్రప్రదేశ్ అవతరించింది.

★ 2012-17 మధ్యకాలంలో 12వ పంచవర్ష ప్రణాళిక అమల్లో ఉండగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి 2014, జూన్ 2న నవ్యాంధ్రప్రదేశ్‌గా ఏర్పడింది. ఆ సమయంలో పర్యవేక్షించ గల 50 అభివృద్ధి సూచికలను లక్ష్యంగా కలిగి ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఈ ప్రణాళికలో మొత్తం రూ.3,42,842 కోట్ల కేటాయింపులతో అన్ని రాష్ట్రాల కంటే ముందంజలో ఉంది.

గత పరీక్షల్లో వచ్చిన ప్రశ్నలు

1. ఆంధ్రప్రదేశ్ పదో పంచవర్ష ప్రణాళికలో అత్యధిక నిధుల వాటా ఏ రంగానిది? (గ్రూప్-2, 2008)
1) శక్తి 2) నీటిపారుదల
3) సామాజిక రంగం 4) గ్రామీణ రంగం

2. కేంద్ర ప్రణాళికా సంఘం అనుమతి కోసం రాష్ట్ర పంచవర్ష ప్రణాళిక ముసాయిదాను ఎవరు సమర్పిస్తారు? (గ్రూప్-2, 2011)
1) ఆర్థిక మంత్రి
2) ముఖ్యమంత్రి
3) రెవెన్యూశాఖ మంత్రి
4) రాష్ట్ర ప్రణాళికా సంఘం కార్యదర్శి

3. ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో పంచవర్ష ప్రణాళిక విజయం ఎక్కువగా వేటి పనితీరుపై ఆధారపడి ఉంటుంది? (గ్రూప్-2, 2011)
1) సేవల రంగం 2) పారిశ్రామిక రంగం
3) ఎగుమతుల రంగం 4) వ్యవసాయ రంగం

4. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పన్నెండో పంచవర్ష ప్రణాళిక ముఖ్య లక్ష్యం వేగవంతమైన, నిలకడగల, అధిక . ..... (గ్రూప్-2, 2012)
1) ఎగుమతుల వృద్ధి 2) మూలధన వృద్ధి
3) సమ్మిళిత వృద్ధి 4) అన్నీ

సమాధానాలు: 1-3; 2-2; 3-4; 4-3.

మరింత సమాచారం కోసం https://t.ly/VBryV లింక్ లేదా www.eenadupratibha.net చూడవచ్చు